# అంగారతల్పం

ఒక్కక్షణం తర్వాత ఏం జరుగుతుందో తెలియని మానవులం. వందలాది వత్సరాల భవిష్యత్తు గురించి ఏవో వెర్రి మొర్రి ఊహలు సారించుతూంటాం. ఏదో ఒక చమత్కారమైన భ్రమలోనే మన మెప్పుడూ బ్రతుకుతూంటాం. ఇదే మానవ జీవిత రహస్యమేమో! మన జీవితంలో జరిగే కొన్ని అపురూప సంఘటనల అనుభూతులకు మల్లేనే. యాదృచ్ఛికంగా జరిగే కొన్ని సన్నివేశాలు కూడా జీవితాంతం మరచిపోలేం.

అదేం చిత్రమో, ఆవేళ ఉదయంనుంచీ నా మనస్సు అగోచరమైన ఏ విషయాన్ని గురించో ఆదుర్దా పడుతూనే వుంది. నేను మరచిపోలేదు, నవంబరునెల చివరిరోజులవి. నేను చేతులారా పెంచినధాలియాలు, పెటోనియాలు, గ్లైలార్డియాలు డయాన్తస్‌లూ వంటి విదేశీ పూలమొక్కలు వొంటెనిండా పూలు విరియబూసి ఠీవిగా నుంచున్నాయి. హాయిగా గాలితో

ఏకసక్కే లాడుతున్నాయి. అవునా? ఆపూల మెత్తనిరంగులు నా మనసుకు మత్తెక్కించవలసిందేనా? కాని అలా జరగలేదు. కార్తీక మాసపు సాయంత్రం చలిగాలి జిమ్ముకుంటూవీస్తోంది దుర్జనుల కుటిలచిత్తంలాగ చలిగాలి బాధాకరంగా ప్రసరిస్తోంది ఎందువల్లనో నాకేమీ వూనుపోవడంలేదు. మాయింటి ముందరి సందులో అటూ ఇటూ పచార్లు చేస్తున్నాను. శూన్యంగా నలుప్రక్కలకూ పరిశీలిస్తున్నాను.

హఠాత్తుగా పెంటపోగులో పడివున్న వస్తువొకటి నా కంటపడింది. ఆగాను, చూశాను, పరీక్షించాను, చక్కగా కాలికోబైండుచేసిన పుస్తకమది. బహుశా పవిత్రమైన బైబిలు గ్రంథం కావచ్చు. లేదా చిన్ననిఘంటువైనా కావచ్చు. ఏదైనా ఉపయోగించే వస్తువే కనక తీయడం మంచిదను కున్నాను. కాని, ఛీ ఎలా తీయడం? నా మర్యాదా, నా హోదా, తాతలనాటినుంచీ పేరుకొని నావరకూ సంక్రమించిన స్థితిగతుల ధర్మమూ ఇవన్నీ పెంటలపాలు కావా? ఎలా తీయడం?...కాని, తీయకపోతే వీలులేదని నాలోని జిజ్ఞాస ఒత్తిడి చేస్తోంది...మనం చేస్తున్న పని ఎంత నీచమైనదైనా. మనం నాగరీకులం కనక ఎవరూ చూడకపోతే ఇబ్బందిలేదు. కనకనే చుట్టూ పరికించి చూసుకున్నాను. గుండెదిటవు చేసు కున్నాను. గభీలున ఆపుస్తకాన్ని తీశాను.

నాకింతవరకూ కనిపించినది పుస్తకం వెనుక భాగం— తిప్పిచూశాను. చిత్రం!...నేను భావించినట్లుగా అది పవిత్ర

మైన బైబిలు గ్రంథం కాదు. పందొమ్మిదివందల ముప్ఫై తొమ్మిదో సంవత్సరపు డైరీమాత్రమే...

ఎవరిదో పాపం పెంటలపాలైంది...మహా మహా జీవితాలే పెంటలపాలవడం తప్పనపుడు చెత్త డైరీ పుస్తకానికి వచ్చిందా? అది సుతరామూ నాకు సంబంధించని మరో అజ్ఞాత వ్యక్తి డైరీ కూడాను. దానిని నేను చదవడం ఏమంత మర్యాదా? కాని, ఇతరుల విషయాలు సాధ్యమైనంత ఎక్కువగా తెలిసికోవాలనిపించే నాలోని మానవదౌర్బల్యం తీసి చదవమని ప్రోద్బలం చేస్తోంది పైగా. పదిహేడేళ్ళక్రితం సంగతులాయె! చూస్తే ఎవడికి మాత్రం వచ్చే ప్రమాదమేమిటి? మొత్తానికి తర్కం జోరుగానే సాగింది. చూడ్డానికే నిశ్చయించుకున్నాను. గబగబా యింట్లో ప్రవేశించాను. వస్తూనే దూకుడుగా గదిలో టేబిలుమీదవున్న లాంతరు హెచ్చించాను. తలవనితలంపుగా భయంకరంగా దీపం ఒక్క దగ్గుదగ్గి కుదుటపడింది.

డైరీ అట్ట తెరిచాను. 'కె. యస్. పాండురంగా రావు' అన్న పేరు స్పష్టంగా రాయబడివుంది. ఆ పేరు క్రిందనే సదరు పాండురంగారావుకు సంబంధించిన కొన్ని వివరాలు కూడ పాతసమాధి రాళ్ళమీది విలాసాల్లాగ అస్పష్టంగా కనిపిస్తున్నాయి. కాని ఎన్ని విషయాలుంటే మాత్రమేంలాభం? ఎరగని వివరాలు ఎరగనట్లే గాలిలోకి తేలిపోతాయి.

అవగాహనకేమీ సహాయపడవు. కనక నే నన్నొక్కటే వేధించ నారంభించింది. 'ఎవరీ పాండురంగారావు?'... మా సందులో కాదుకదా, మా యింటికి ఒకటి రెండు ఫర్లాంగుల పైవారంలో ఎక్కడా నా ముప్ఫయ్యేళ్ళ జీవితంలోనూ తారసపడనే లేదు. పాండురంగారావును గురించి నా మనస్సు పరిపరివిధాల ఆలోచిస్తోంది. నేనెప్పుడూ చూడని, కనీసం పేరైనా ఎప్పుడూ వినని కె. యస్. పాండురంగారావు నా కన్నుల ముందు ప్రత్యక్ష మవుతున్నాడు.

అతను సన్నగా పొడుగ్గా వుంటాడు. నాజూకుగా వుంటాడు. 'పుంసాం మోహన రూపాయ' అని ఆయనను గురించి చెప్పలేం గాని, చూసీచూడగానే మృదువుగా ఆక ర్షించే సత్తా కలవాడే! చామనచాయగా వుంటాడు. లోతుగా విశాలంగావుండే కన్నులూ, ఒత్తుగా మెరిసే కనుబొమలూ అతని ప్రత్యేకత. సన్నని కత్తిరింపు మీసం అతని రూపానికి అలంకారం.

ఈ విధమైన ఆకారంతో నా మనసుకు దర్శనమిచ్చి, పాండురంగారావు పరిచయమయ్యాడు. అతని జీవితంలో 1939వ సంవత్సరం గురించి తెలుసుకోకుండా ఉండడమెలాగ? కనుకనే పేజీలుతిరగవేస్తున్నాను. నెలగడిచింది. రెండు..మూడు ...నాలుగు నెలలు కూడా గడిచాయి. పాండురంగని జీవితం

గురించిన ఏవిషయమూ కనిపించలేదు. దురదృష్టవశాత్తూ అతని తదనంతరమో లేక అతనికే తెలియకుండానో సంక్రమింపచేసుకున్న ఎవరో కుర్రాళ్ళ కొంకిరిగీతలు మాత్రం కనిపించాయి. ఏవో చిల్లరమల్లర విషయాల్ని తెలియ చేస్తున్నాయి; 'గీసాల వీర్రాజు దొంగ వెధవ' అనీ, 'ఆచారి బడా చోర్' అనీ, 'సైకిల్‌వాలీ ఆనందం' అనీ, 'మొక్కుబడికి వెళ్ళిన భర్త లేని గర్భం' అనీ, 'లాటరీ పెళ్ళాం' అనీ—ఇలాగ ఏవేవో అస్పష్టమైన పిచ్చిగాతలు కాళీ పేజీలన్నీ ఆక్రమించాయి శూన్యంగా, నిష్క్రియగా మే నెలలో పన్నెండవ రోజువరకూ పాండురంగారావు 39వ సంవత్సరపు జీవితం గడచిపోయింది.

పదమూడో తేదీనుంచి అతని జీవితఘట్టాలు ఇంగ్లీషులో ప్రారంభమయ్యాయి. అక్కడక్కడ అన్వయమే కుదరనంత ఆత్మ సాంకేతికంగా వుందతని యింగ్లీషు.

"...మే 13; శనివారం వైశాఖ బహుళ ద్వాదశి. ఈ మెడికల్ డైయిరీని డాక్టర్ బి. సి. కె. గారు బహూకరించారు. ఆయన నాకు చిరపరిచితులే; వృద్ధులు.

పాండురంగారావుకు మే 13వ తేదీని డైయిరీని బహూకరించిన డాక్టర్‌గారి పేరు స్పష్టంగా తెలియడంలేదు...తరువాత

'...మే 14;—కమల గతరాత్రి అతిభయంకరంగా బాధపడింది. శ్రీ రావును కలుసుకున్నాను. అతని వ్యవహారం లోని చిక్కులన్నీ విశదపరిచాను. పొరపాటంతా అతనిదే. ఆ

విషయంలో మాత్రం అతని నడత చాలా చెడ్డగా వుంది. ముఖ్యంగా అతను, తన భార్య విషయంలో తన నడవడి అసహ్యంగా వుందని తనే ఒప్పుకున్నాడు. అతని పరిస్థితి చూస్తే నాకు జాలివేస్తోంది..."

ఈ అస్పష్టమైన కొద్ది పంక్తులలో స్పష్టమైన జీవిత చరిత్ర ఏదో తొంగిచూడ నారంభించింది. ఈ రావుగారెవరో మర్యాదగల పెద్ద ఉద్యోగిగా కనిపిస్తున్నాడు. ఒకనాడు తన భార్యను అనుమానించి, కొట్టి తిట్టి అమానుషంగా ప్రవర్తించి వుంటాడు. లేక ఏ చిన్నవిషయం మీదనో కోపాగ్ని రెచ్చి, తాను భర్తనన్న యథార్థాన్ని రుజువుచేసుకోడానికి ఆమెను నిందించి అవమానపరచి వుంటాడు. తన తప్పేమీలేని ఆమె సహించలేక ఎదురుతిరిగింది కాబోలు. ఇద్దరిమధ్యా ఘర్షణ పెరిగింది. మాట్లాడుకోవడం మానేశారు. ఒక యింట్లోనే వున్నా ఎవరిదారి వారిదిగా బ్రతుకుతున్నారు. ఆసమయంలో మన పాండురంగారావు శ్రీరావుగారింటికి స్నేహ ధర్మంలో వెళ్ళాడు. శ్రీరావు తన విషయాలన్నీ చర్చించి వుంటాడు. సరే, అతను—దాంపత్య జీవితంలోని తప్పొప్పులను విశదీకరించాడు. పొడసూపిన సమస్యలను పరిష్కరించి వుంటాడు. నాకాసమయంలో, అతనిలో ఆజానుబాహుడైన సంస్కర్త కనిపించాడు.

"...మే, 15; కమలకీవేళ ఎక్సరే తీశారు. శ్రీరావు

దంపతులను చూచివచ్చాను. సద్దుమణిగింది. చిత్రమేమిటంటే 'టి. సి. హెచ్' లో డాక్టర్ ఎ. ఆర్. శ్యామా అనే బంగాలీ అమ్మాయిని కలుసుకున్నాను. నన్ను చూచిన క్షణంనుంచీ చూపులు నామీద ఆపేసి, నన్నేదో అభినందిస్తున్న భావాన్ని వ్యక్తపరిచిందామె. అబ్బా! ఆమె నన్ను కళ్ళతో మింగేస్తుందా అన్నంత తీవ్రిత ఆమెలో కనిపించింది. నాకు సందేహంలేదు; ఆమె సౌందర్యవతే!..."

పాండురంగారావు భార్య కమల... పాపం! ఎన్నో రాత్రిల యమయాతన లనుభవించింది! ఆఖరికి డాక్టర్లు పరీక్షించారు. ఎక్సరే తీశారు. అతని జీవితం నిజంగా కష్టప్రికరణంలో ప్రివేశిస్తోంది. అయినా ఏం తప్పుతాయి గనక! స్నేహితుని దాంపత్య జీవితంలో వచ్చిన పొరపొరలను సర్దుబాటు చేయాలి. టి.సి.హెచ్.లో కనిపించిన బంగాలీ అమ్మాయిని గురించి ఆలోచించాలి...

కాని బంగాలీ అమ్మాయిపేరు 'ఏ.ఆర్. శ్యామా' అని వుండటమేమిటిచెప్మా? 'టి.సి.హెచ్ అంటే టర్నరుస్ట్రాల్టరీ' కాదుగదా! ఇంకా సందేహమేమిటా విషయంలో... మన కథకు కార్యరంగం విశాఖపట్నం. పాండురంగారావుతో సహా ఆ అందమైన బంగాలీఅమ్మాయి—నా కళ్ళకు కట్టినట్లేవుంది... నాజూకైన శరీరం. సున్నితమైన మంచిగంధపు రంగు...కోలవాటుగా బుగ్గలు క్రిందికి జారినట్లుగా వుండే ముఖం, కుడి బుగ్గమీద సెలవులకు అంగుళంపైన చక్కని పుట్టుమచ్చ...

చూడముచ్చటగా వున్నదా అమ్మాయి. మధ్య పాపిడి తీసికొని ఒదులుగా జడవేసుకుంది. పాపటలో ఎర్రని కుంకుమరేఖ నలరుకొంది. ప్రకాశించే నల్లని అంచుగల తెల్లని చీర కట్టుకొంది. అకస్మాత్తుగా అతని మనసులో ప్రవేశించింది. కొంప దీసి జీవితంలో కూడ ప్రవేశించదుకదా! ఏమో చూడాలి.

..."మే...16. ప్రియమైనవి.. గోవిందరావును అభినందిస్తూ టెలిగ్రాం పంపించాను...హాస్పిటల్‌లో ఒక భయంకరమైన శవాన్ని చూశాను...కుళ్ళికుళ్ళి చచ్చిన ఆ శవాన్ని చూడలేకపోయాను. కళ్ళుతిరిగి పోయాయి...అనుకున్నట్టుగా శ్రీరావును కలుసుకోవడం పడలేదు."

పాపం అతని హృదయం ఎంత సున్నితం. మామూలు మనిషిలా కనిపించే అతనిజీవితంలో ఎన్ని కలలు...వికృతంగా భయంకరంగా తయారైన శవాన్ని చూసినా ఉండబట్టలేదు. అందమైన బంగాలీ పడుచు లేడికళ్ళుచూచినా ఆపుకోలేదు. అలాంటిది అతనిభార్య ఆరోగ్యం ఏమవదల్చుకున్నదో మరి!

"... మే. 17: కమలకి ఔషధం ప్రారంభించారు. క్షయగా డాక్టరు నిర్ధారణ చేశారు: నా జీవితం మీద పిడుగు పడింది. ప్రియమైన కమల జీవితాన్ని కాపాడుకోనేందుకు ఏమి త్యాగం చేయగలను?..."

తరువాత ఏడురోజులకాగితాలు శూన్యంగావున్నాయి. కాని అతని దినచర్యమాత్రం శూన్యమైవుండదు: ఆసుపత్రిలో

వున్న భార్యను చూస్తూండటం; కావలసిన సహాయం చేస్తూ వుండటం; రావుగారినీ, బంగాలీ అమ్మాయినీ కలుసుకుంటూ వుండటం,—ఇలాగే బహుశా సాగుతూవుంటుంది. ఏమైనా భార్యసుస్తీ మాత్రం—తనశరీరంలో సరిగ్గా సగం కూలిపోయి నంత బాధ కలిగిస్తున్నట్లు స్పష్టం. ... "మే 24 ; కమలకు గోల్డు మూడు మోతాదులూ, కాల్షియమూ వాడుతున్నారు'

అతని జీవితం అధ్వాన్నపు అడవిలా, ఆందోళనగా సాగుతున్నట్లు స్పష్టం. ఆతనికి ఆత్మశాంతి చెడింది. నిముషం తీరిక లేకుండా బజారులన్నీ తిరుగుతున్నాడు. ఊరట లేదు; కనుకనే అతని దినచర్యలోని పుటలన్నీ ఖాళీగా గడచి పోతు న్నాయి. ప్రతిముఖంలోనూ సానుభూతిని అన్వేషిస్తున్నాడు.

..."మే. 29; సోమవారం. జేష్ఠపౌర్ణమి 'సి' వల్ల ఆశాభంగం కలిగింది. రాజుతోసహా అందరూ ఒక్కటిగానే కనిపిస్తున్నారు. సరే ఏంచేస్తాం?...రాత్రి సినిమాకు వెళ్లాను"

అతని బ్రతుకు దారిలో మళ్ళీ రెండు ఖాళీ రోజులు... ఎంత నిరాశలో వున్నా, ఏదో చిన్నఆశారేఖ మెరవడం జీవి తానికి తప్పదేమో...? కేవలమూ ఆశా, లేక కేవలమూ నిరాశ అన్న అవిరామతత్వాలు కవుల కావ్యాల్లోనే కనిపిస్తా యేమో?...అంతనిరాశలో వున్నా అతను చిన్న చిన్న ఆనం దాల కోసం ప్రయత్నిస్తూనే వున్నాడు. కనుకనే...

...జూన్–ఒకటి, లక్ష్మివారం, జ్యేష్ఠబహుళ విదియ– పిన్నిగారింట్లో విందుచేసుకొన్నాం; శ్రీరావుతో సహా!"

ఆసుపత్రిలో భార్య చావుబ్రతుకుల మధ్య తారట్లాడుతోంది. మగతలో, గుడ్డివెలుతురులో బ్రతుకు రక్షించుకో జూస్తోంది. భయంకరంగా వీచే మృత్యు ఝంఝామారుతంలో కొడిగట్టిన ప్రాణదీపాన్ని కాపాడుకో యత్నిస్తోంది. కాని, అతడు మాత్రం ఆశనిరాశల మధ్య వూగిసలాడుతూనే వున్నాడు. చిన్నచిన్న విందులూ జరుపుకుంటూనే వున్నాడు. వీలైనప్పుడల్లా, బహుశా–టర్నర్సు ఫౌల్ట్రీకి వెడుతూనే వుంటాడు. బంగాలీయువతి డాక్టర్ శ్యామని కల్సుకుంటూనే వుంటాడనికూడ మనం భావించడంలో అన్యాయం ఉండదు. కాని, ఈ విషయం మాత్రం అతని డైయిరీలో, చిక్కని రేఖలతో చిత్రింపబడలేదు. మంచిచెడ్డలూ, ఆశానిరాశలూ, సుఖదుఃఖాలూ వంటి ద్వంద్వాలన్నీ అతి సాదా విషయాలకిమల్లేనే గుర్తించుకున్నాడు...కాని

..."జూన్ – రెండు; నాజీవితంలో ఈ రోజంత చెడ్డ రోజులేదు. ఈ భయంకరత్వాన్ని, హృదయక్షోభని, నా జన్మలో మరచిపోలేను. కమల నన్ను చాలా కోపపడింది. నేను డబ్బుని ఏదోమాయగా ఖర్చు పెట్టేస్తున్నానట! కాని డబ్బును ఏం మాయం చేస్తున్నానో నాకే అర్థంకాదు. రాజు కూడా ఆమె గొంతులో గొంతుకలిపాడు. 'కారణాలేమైతే

నేం...నువ్వు శ్యామయింటికి తరచుగా వెళ్ళకూడదు.' అన్నాడు. నేను ఎవరినీ చూడకూడదు. ఎవరింటికి వెళ్ళకూడదు! ఆఖరికి పిన్నిగారింటికి కూడానా?—హరి భగవాన్! బుర్ర గిరగిరా తిరిగిపోయింది. పెటిల్లుమని కపాలం పగిలిపోతుందేమో నన్నంత తలనొప్పి ప్రారంభించింది..."

అని కాస్త ముదురురంగులో చిత్రించుకున్న పాండురంగారావు మనస్తాపంమాత్రం నాకు స్పష్టంగానే కనిపిస్తోంది. కమల...కేవలమూ మృత్యు ముఖంలోకి ప్రయాణం చేస్తున్న కమల...భర్త జీవిత వ్యాపారాన్ని పసిగట్టినట్టుంది. సహజమైన ఈర్ష్య, మండే కుంగించే ఈర్ష్య!...నిజానికి తను దుబారాగా ఖర్చు పెడుతున్నాడన్నది ఆమె ఉద్దేశం కూడా కాదు. ప్రస్తుతం డబ్బుసమస్య ఒకటే వారిద్దరి జీవితాలకీ సంబంధించినది కనుక దాన్ని పురస్కరించుకునే అతన్ని చివాట్లు పెడితే—తన మనస్సుకు కొంతశాంతి; గుండెల్లో గుబులుకొనేబాధ ఉపశమిస్తుంది. అంతే పాపం, అంతకన్నా ఆమెకుకూడా వేరే దురుద్దేశ మేమీ లేదు...ఇంతకీ ఈరాజెవరు? అతనా మెతరవు దగ్గరచుట్టమేమో....

..."జూన్ – 3 – శనివారం, నిన్నటి సంఘటనలను గురించి బాధతో భారంతో ఈవేళ వ్రాసుకుంటున్నాను. అబ్బా! గుండె ఆగిపోకూడదూ?..."

..."జూన్-4 : పిన్ని గారింటికి వెళ్ళలేదు..."

..."జూన్-5 : ఆమెకోసం మందులు కొన్నాను. టవలు మూడణాలు, కాబేజీ పావలా ముక్కానీ..."

పాపవు మాటలెందుకు? పాండురంగారావు అనవసర మైన దుబారా ఖర్చులేమీ పెట్టడంలేదు. ఏం కొంటే అది తక్షణం తన డైయిరీలో వ్రాసుకుంటోనే వున్నాడు. అతని డైయిరీలో పుష్కలంగా కనిపించే జమాఖర్చుల జాబితాలే ఆ విషయానికి సాక్ష్యమిస్తాయి. అయినా అవి కారుదొక రోజులు. పంచదార వీశె పావలా; రెండు కోడిగ్రుడ్లూ బేడ... అరబస్తా సన్నబియ్యం ఐదురూపాయల పదణాలు...

..."జూన్-పది-శనివారం, జ్యేష్ఠబహుళ ఏకాదశి. జీవితం నికృష్టంగా సాగుతోంది. దైన్యమూ హైన్యమూ రాత్రింబవళ్ళయ్యాయి. ఈ దుఃఖభారాన్ని మోయడంకన్న చావడం వేయిరెట్లు నయమనిపిస్తోంది—

'దీర్ఘ విరహం జయిస్తుంది ప్రేమను
కానీ, ఓ మనిషీ—
నమ్మూ నమ్మకపో, నామాటను.
ప్రయత్నించాను; అయ్యో జీవితమంతా
ప్రయత్నించాను; పరీక్షించాను
నా సర్వశక్తులనూ!...
కానీ నిజం మరువలేకపోతున్నాను..."

— యస్. డబ్ల్యు. థామస్.

నాటి డెయిరీకాగితంలో అతని మనస్తాపానికి, ఊతగా థామస్‌కవి ఇంగ్లీషు పద్యాన్నికూడా ఉపయోగించుకున్నాడు. ఆంగ్లపద్యానికి నా ఆంధ్రానువాదం అసంతృప్తిగానే వుంది. ఏంచేయను? ఏభాష కవిత్వాన్ని ఆభాషలో వింటేనే సొగసూ రుచీ, ఆనందమూను!

ఆనాటి ఆతని హృదయ పరితాపాన్ని, తీరంలేని లోతుల్లోకి జారుకుపోతూన్న మనస్థితిని నాలుగుపాదాల యింగ్లీషు పద్యంతో పోల్చుకున్నాడు... నిరాశ దావానలంలా వ్యాపిస్తోంది. ఆధారపడుతుందన్న ప్రతికొమ్మా భగభగ మండి పోతోంది. కనుకనే దుర్భరమైన ఈ పెనుగులాటకన్న చావడమే మంచిదని నిర్ణయించుకున్నాడు. నిర్ణయించుకోవడం తేలికే! సుఖంగా బ్రతకడంలాగానే సుఖంగా చావడంకూడా కష్టమే!

థామస్‌కవి వ్రాసిన ఈ ఆంగ్లపద్యాన్ని పాండురంగారావు తన దినచర్యలో ఉల్లేఖించుకోవడంలోగల భావమేమిటి? ఏ దీర్ఘ విరహం ప్రణయాన్ని జయిస్తుంది? వ్యాధిపీడితురాలైన కమల విరహమా? లేక తన బ్రతుకుమీద పడ్డ పిడుగుపాటు నుంచి తెప్పరిల్లి, తీయని సంగీతాల అనుభూతుల్ని వెదుక్కుంటూ ఆశ్రయించిన బంగాలీ లేడీడాక్టర్ శ్యామకీ తనకీ ప్రేమ ముదిరిందా?... చూపులనుంచి అనుభూతుల వరకూ ఎదిగిందా? ఎదిగి ఎదిగి విరహంగా పరిణమించిందా? ఏమిటీ... ఈ గొడవంతా ఏమిటి?... నాకు కలిగిన అనంతమైన సందేహాలను తీర్చడానికి అతని డెయిరీ ప్రయత్నించలేదు.

కాని నేను మొదట్లో అనుకున్నట్టుగా పాండురంగారావు మామూలు సాదామనిషి మాత్రం కాదనీ, విద్యా విజ్ఞానాల తోటీ, కళలతోటీ, సంబంధమున్న రసజ్ఞుడేననీ అర్థంచేసుకోక తప్పిందికాదు.

ఈమాటు స్పష్టంగా, అతని పల్చని బుగ్గలూ, సొగ తేరిన ముక్కూ, ఆలోచనలతో యాతనలతో భౌతిక మానసిక సమస్యలతో సతమతమయ్యే అతని నుదుటిమీది రేఖలూ అతి సన్నిహితంగా కనిపించ నారంభించాయి. అంతేగాదు— సుమారు నాలుగేళ్ళకాలం తనతో కలిసిమెలిసి జీవించిన కమల జీవితం సుడిగుండంలోపడ్డం అతన్ని సమూలంగా క్రుంగ దీస్తోంది. పాపం— కమల, భర్తతో కలసి ఎన్నో కలలుగన్న కమల... సన్నపోగారుతో మలచిన కాంస్య విగ్రహంలా మెరిసే కమల... తపించిపోయే హృదయానికి తన సాన్ని హిత్యంతో చలువపందిరిలా ఆశ్రియమిచ్చిన కమల జీవిత మంతా అతనికొక సమస్యగా మారిపోయింది. ఇంత అందానికి ఇంత నైర్మల్యానికీ, ఇంత పవిత్రతకీ, ఎక్కడ దాపురించిందో పాడురోగం... అతని మనస్సు అగ్నిగుండంలోపడి ఘూర్ణిల్లి పోతోంది!... అంతేకాదు, అతని జీవితానికి సంబంధించిన మరొక విషయంకూడా సుబోధకమైంది నాకు; కేవలమూ జబ్బుపడ్డ కమలకు వైద్యసౌకర్యం కలిగించే నిమిత్తమే విశాఖ పట్నం వచ్చినవాడు కాడతను. ఆ వూళ్ళోనే స్థిరనివాసమేర్ప

రచుకున్నవాడే... ఉద్యోగంవల్లనో మరేవ్యాపకంవల్లనో అతని డైయిరీ స్పష్టంచేయడంలేదు. ముఖ్యంగా అతను విశాఖ లోనే జీవిస్తున్నాడనటానికి జూన్ 11వ తేదీ డైయిరీలో వ్రాసిన "యింటిఅద్దె ఆరునెలలకు తొంభై రూపాయలు ఇచ్చిన"ట్టున్న విషయం ఆధారపడుతోంది...

"...జూన్ పన్నెండు. కమలకు భయంకరమైన దగ్గు వస్తూనేవుంది. మధ్యాహ్నం ఒంటిగంటవరకూ ఎడతెరిపిలేని దగ్గుతో బాధపడుతూనేవుంది. జ్వరంకూడ జాస్తీగానేవచ్చింది. ఆమె బాధ చూడలేకపోతున్నాను..."

తరువాత మున్నయ్యోనిమిది డైయిరీ కాగితాల్లోమాత్రం అతని జీవితానికి సంబంధించిన ఏ వివరాలూ లేవు. మిగిలిన పుటల్లో మొత్తం ఏడువందల యొనభై రూపాయలకు ఖర్చుల జాబితాలు మాత్రం ఉన్నాయి. జీవితమనుక్షణమూ తెలిసో తెలియకనో ధనపిశాచి అడుగులకు మడుగులొత్తడం ఏవిధంగా తప్పదో అతని డైయిరీలోని ఖర్చుల జాబితా రుజువుచేస్తుంది.. తరువాత ఒకనాడు...

"ఆగస్టు...16...బుధవారం...శ్రావణ అమావాస్య. రాత్రి సరిగ్గా ఏడున్నరగంటలకు ఆమెకు స్మారకం తప్పింది. పది నిమిషాలు గడిస్తేనేకాని మళ్ళీ తెలివిరాలేదు... కటిక అమావాస్య నా బ్రతుకుమీద నల్లనినీడల్ని బరపుతోంది.."

కమల వ్యాధి తీవ్రరూపం ధరిస్తోందని అర్థమవుతోంది. తెరపు మరుపులుగా స్మారకం తప్పుతోంది. పాండురంగా రావుకు మానసిక యాతన అధికతరమౌతోంది. అందువల్లనే తన మనస్తాపాన్ని నిర్జించడం కోసమే సిగరెట్లు కాల్చడం, వక్కపొడి నమలడంవంటి చిల్లర వ్యసనాలు అధికమయ్యాయి. ఆ విషయం కూడా అతని డెయిరీ కాగితాల్లోని జమాఖర్చుల మూలంగానే వ్యక్తమవుతూన్నది.

..."ఆగస్టు-23-బుధవారం రెండురూపాయలు బదులు చేశాను..."

అని మాత్రమే వున్న అతని దినచర్య విషమపరిస్థితులకు తట్టుకోలేని ఆతని ఆర్థిక పరిస్థితుల పతనానికి సూచనప్రాయ మవుతోంది...మళ్ళీ అతని డెయిరీలో రెండునెలల కాలం కేవలమూ జమాఖర్చుల జాబితామాత్రమే వ్రాయబడివుంది.

డబ్బు.....డబ్బు.....డబ్బు! దుబ్బుమీసాల రక్కసిలా ఈ డబ్బు ఎక్కడపడితే అక్కడే మానవ హృదయ మార్దవాలపై విషఝుంఝులు క్రక్కడం తప్పదు కాబోలు! అబ్బా, ఈ డబ్బుసమస్యే మానవులకు లేకపోతే—మానస సరోవరాలలో ఎంతటి అమరకమలాలు వికసించగలవో? ఏమైతేనేం—తప్పని కీడుగురించి ఎంతని వ్యథపడగలము? కనుకనే తర్వాత...

అక్టోబరు 22 సోమవారంనాడు '(శ్రీ). వి. ఆర్.' తనకు అయిదురూపాయిలు బదులిచ్చారనీ, మళ్ళీ అక్టోబరు 26వ తేదీన కూడా వారే ఎనిమిదిరూపాయలు బదులు యిచ్చారనీ —మాత్రం వ్రాయబడి వుంది...అంతే!

కమలకు సంభవించిన భయంకరవ్యాధి ఏ స్థితిలో వున్నదో అతని డైయిరీలో వివరించబడలేదు. బంగాలీ అమ్మాయి శ్యామవలపుల వాననజల్లు చిలికి చిలికి గాలివానగా మారిందో లేదో కూడ అతని డైయిరీ వ్యక్తీకరించడంలేదు. మానవ జీవితంలో ముఖ్యాతిక మానుషవంతులు ఆర్థికవిషయాల ప్రాబల్యం రాచరికం చేయడం తప్పనట్లే ఆతని డైయిరీనికూడ జమాఖర్చుల జాపితాలే అత్యధిక భాగం దురాక్రమణ చేశాయి. కమల జబ్బుతో చుక్కాని లేని నావలా ఊగిసలాడిపోతున్న అతని మనసు తన వ్యక్తిగత విషయాల దిన చర్యలలో కూడ సరిగ్గా ప్రతిబింబించడంలేదు.

అలాంటి మానవుని మనస్సముద్రపు అఖాతాలను ఏ సాహిత్యం, ఏకళ ఏసంగీతం, మాత్రం సంపూర్ణంగా ప్రతిబింబించగలదు?

—★—

[ప్రచురణ : ఆకాశవాణి సౌజన్యంతో—అక్టోబరు '59]